


52 బీరు సీసాలతో ఎక్సైజ్ కానిస్టేబుల్ అరెస్టు

రణస్థలం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని యూబీ పరిశ్రమలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.జగదీష్ 52 బీరు సీసాలతో సోమవారం రాత్రి జేఆర్.పురం పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎక్సైజ్ కానిస్టేబుల్ జగదీష్ 52 బీరుసీసాలను రెండు బస్తాల్లో సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై తీసుకొస్తున్నారు. పెట్రోల్ బంకు వద్ద పోలీసులు తనిఖీ చేసి.. ఆ బీరుసీసాలు స్థానిక యూబీ పరిశ్రమ నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తించారు. దీంతో కానిస్టేబుల్ జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని జేఆర్.పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

అలా నిర్మించి.. వదిలేశారు



చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులు (ఫైల్)



పలాసలో కిడ్నీ పరిశోధన కేంద్రం

- వైసీపీ హయాంలో రీసెర్చ్ సెంటరంటూ ప్రగల్భాలు
- అప్పుడు నిర్మించింది భవనం మాత్రమే..
- ఇప్పటికీ అరకొర సిబ్బంది.. కీలక పోస్టులన్నీ ఖాళీ
- 2014-19 మధ్య ఇచ్చిన డయాలసిస్ యంత్రాలే ఇప్పటికీ
- కూటమి ప్రభుత్వం వచ్చాక మెరుగవుతున్న సేవలు
- స్వచ్ఛంద సంస్థ సహకారంతో అంబులెన్స్ ఏర్పాటు

శ్రీకాకుళం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో వేలాది మంది కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ కిడ్నీ రోగాల వ్యాప్తికి గల కారణాలు పూర్తిస్థాయిలో కనుగొనలేదు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కిడ్నీ రోగులను ఉద్ధరిస్తున్నట్లు.. మూలకారణాలను అన్వేషించేలా పరిశోధనలు చేపడతామని, వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకున్నట్లు అప్పటి కీలక నేతలు గొప్పలు చెప్పుకున్నారు. కాగా.. క్షేత్రస్థాయిలో 'కిడ్నీ రీసెర్చ్ సెంటర్' భవనం మాత్రమే నిర్మించి వదిలేశారు. కీలక పోస్టులు భర్తీ చేయక.. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కీలకపోస్టులు, సిబ్బంది ఖాళీ

పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రంలో కీలక పోస్టుల్లో ఉండాల్సిన అధికారులు, వైద్యులు.. అత్యధికంగా ఖాళీగానే ఉన్నాయి. ఆస్పత్రి ఉద్యోగుల విధులు.. ఇతరత్రా పనులకు సంబంధించి కీలకమైన పరిపాలన అధికారి(ఏవో) పోస్టు కూడా ఖాళీ. నెఫ్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు రెండు, వస్కులర్ సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు, జనరల్ (మిగతా 6వ పేజీలో..)

టీడీపీ హయాంలో మంజూరైనవే

ఉద్దానం ప్రాంతం నుంచి గతంలో డయాలసిస్ కోసం కిడ్నీ రోగులు.. శ్రీకాకుళం లేదా విశాఖపట్నం వెళ్లేవారు. రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ఉద్దానం కిడ్నీ రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందించాలని 2014-19 మధ్యకాలంలో జనసేనాని పవన్‌కల్యాణ్.. ఈ ప్రాంతం వచ్చి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి ఉద్దానంలో కిడ్నీ రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డయాలసిస్ యూనిట్లను పెంచారు. పలాసలో ఇప్పటికీ ఆ డయాలసిస్ యూనిట్లే నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కిడ్నీరీసెర్చ్ అంటూ పలాసలో భవనం నిర్మించింది. కానీ, రోగులకు అనుగుణంగా డయాలసిస్ సెంటర్లను సైతం పెంచలేదు. పూర్తిస్థాయిలో సిబ్బంది కూడా లేరు. గత సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వయంగా పలాసకు వచ్చి గొప్ప గొప్ప ప్రకటనలు చేసేశారు. కానీ రీసెర్చ్‌కు అవసరమైన సిబ్బందిని.. పరికరాలను కూడా పూర్తిస్థాయిలో సమకూర్చలేదు. దీంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్... డయాలసిస్ కేంద్రంగానే నడుస్తోంది. ఇటీవల 'గ్లో' సంస్థ కిడ్నీ రీసెర్చ్‌సెంటర్‌కు వెళ్లే రోగులకు అవసరార్థం అంబులెన్స్‌ను సమకూర్చింది. సేవలు మెరుగుపరిచేలా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

కన్నీళ్లపేట!



గల్లంతైన ధనరాజు, కృష్ణ(ఫైల్)

- సముద్రంలో పడవ బోల్తా
- నీటిలో పడిన నలుగురు మత్స్యకారులు
- ఒకరు ఈదుకుంటూ ఒడ్డుకు...
- మరొకరిని రక్షించిన తోటి మత్స్యకారులు
- ఇద్దరు గల్లంతు
- విషాదంలో మంచినీళ్లపేట



విలపిస్తున్న ధనరాజు భార్య కృష్ణవేణి, కుటుంబ సభ్యులు, బంధువులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మంగళవారం వేకువజామున నాలుగు గంటల సమయం... ఎప్పటిలాగానే ఆ నలుగురు మిత్రులు సముద్రంలో చేపల వేటకు బయలుదేరారు. మధ్యాహ్నానికి తిరిగి వచ్చేస్తామని కుటుంబ సభ్యులతో చెప్పారు. చిన్న ఇంజను బోటు మీద వేటకు కదిలారు. సాగర జలాల్లో కొంత దూరం వెళ్లారు. ఇంతలో బోటులో కుదుపు. ఓ రాకాసి అల పడవపై విరుచుకు పడింది. ఏం జరిగిందో గుర్తించేలోపే అది తలకిందులైంది. నలుగురు మిత్రులూ చెల్లాచెదురయ్యారు. అందులో ఇద్దరు బయట పడగా...మరో ఇద్దరి ఆచూకీ తెలియడం లేదు. ఈ విషాద సంఘటన వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో చోటుచేసుకుంది. పోలీసులు.. గ్రామస్తులు తెలిపిన వివరాలివీ...

- మంచినీళ్లపేటకు చెందిన బొంగు కోటేశ్వరరావు, బొంగు ధనరాజు, వంక కృష్ణ, చింత వెంకటేష్‌లు మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు మంచినీళ్లపేట- నువ్వలరేవు సమీపంలో చేపలవేట కోసం బోటులో సముద్రంలోకి బయలుదేరారు. తీరం నుంచి ఓ అర కిలోమీటరు దూరం లోపలికి వెళ్లేసరికి ఓ కెరటం బలంగా బోటును తాకింది. దీంతో బోటు ఒక్కసారిగా సముద్రంలో బోల్తాపడింది. అందులో ఉన్న నలుగురు మత్స్యకారులు నీటిలో పడిపోయారు. చీకటిగా ఉండడంతో ఎవరు ఎక్కడ ఉన్నారో గుర్తించలేకపోయారు. వీరిలో చింత వెంకటేష్ అతి కష్టమ్మీద ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. అలలతాకిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బొంగు కోటేశ్వరరావును సమీపంలో మరో బోటులో ఉన్న గ్రామస్తులు రక్షించి... ఒడ్డుకు చేర్చారు. కానీ వంక కృష్ణ(44), బొంగు ధనరాజు(45) ఆచూకీ దొరకలేదు. మిగిలిన మత్స్యకారులు సముద్రంలో గాలించినా.. వారి ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న మత్స్యకారుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. మెరైన్ సీఐ రాము, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ నిహార్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. మాజీ సర్పంచ్‌లు గుల్ల చిన్నారావు, గోశాల శంభూరావు, వైస్ ఎంపీపీ వంక రాజుతో పాటు స్థానికుల నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌ఐ నిహార్ తెలిపారు. హెలికాప్టర్‌తో కూడా బారువా నుంచి సంతబొమ్మాళి తీరం వరకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు ఆరా

మంచినీళ్లపేటలో ఇద్దరు మత్స్యకారులు గల్లంతైన విషయమై రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరా తీశారు. స్థానిక మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావుతో మాట్లాడి వివరాలు సేకరించారు. ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని పోలీసు, మెరైన్ అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి.. గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు.

ఉధృతంగా కెరటాలు

గత మూడు రోజుల నుంచి సముద్రం (మిగతా 6వ పేజీలో..)

ఇదే చివరి రోజు అనుకున్నా..



తోటి మత్స్యకారులతో కలసి చేపల వేటకు వెళ్లాను. పెద్ద అల దాటికి బోటు బోల్తా పడింది. అందులో ఉన్న వారందరం సముద్రంలో పడిపోయాం. చీకటిలో ఎవరు ఎక్కడ ఉన్నారో కనిపించలేదు. నన్ను అలలు లోపలకు లాగుతుండడంతో నా జీవితంలో ఇదే చివరి రోజు అనుకున్నా. శక్తిమేర ప్రయత్నం చేసి... అటుగా వెళుతున్న చింత చిరంజీవి బోటును చూసి కేకలు వేశాను వారు వచ్చి రక్షించడంతో బయటపడ్డాను. నాతో వచ్చిన వాళ్లు కనిపించకపోవడం బాధగా ఉంది.

\- బొంగు కోటేశ్వరరావు, బోటు యజమాని



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజల జీవితాల్లో వెలుగులు

- అదే నిజమైన సంక్షేమం: మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో ఆయన సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్ అందజేశారు. అనంతరం మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం రూ.2వేలు ఉన్న పింఛన్‌ను విడతల వారీగా రూ.3వేలకు పెంచింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలకు ఒకేసారి పెంచి ప్రతీనెలా ఠంచన్‌గా ఒకటో తేదీనే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. దివ్యాంగులు, డయాలసిస్ రోగులు, మంచానికే పరిమితమైన వారికి సైతం ఆర్థిక భరోసానిచ్చేలా రెట్టింపు పింఛన్ అందజేస్తున్నామ'ని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, టీడీపీ నాయకుడు కింజరాపు హరివర ప్రసాద్ పాల్గొన్నారు.

పూత ఏదీ?

- మామిడి పంటపై పొగమంచు దెబ్బ



పెంటిభద్రలో మాడిపోయిన మామిడిపూత

పలాస, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మామిడి పంటకు గడ్డుకాలం ఏర్పడింది. పలాస డివిజన్‌లో మామిడి పూత పూసినా పొగమంచు కారణంగా మొత్తం పువ్వంతా మాడిపోయింది. అక్కడక్కడ ఒక్కో కాయి మాత్రమే కనిపిస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పలాస డివిజన్‌లో 10వేల హెక్టార్లల్లో మామిడి పంటను సాగుచేస్తున్నారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, తెగుళ్లు సోకినా (మిగతా 6వ పేజీలో..)

జీవన వేదం.. ఈ తుంబుర సొంతం
- రామాయణ, భారతం వినిపించే ఎరుకల కులస్థులు
- కనుమరుగవుతున్న సంప్రదాయ కళ
6లో

పశువుల దాహార్తి తీర్చేందుకు చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
6లో

ప్రజలకు 'ఆధార్' కష్టాలు

- శ్రీకాకుళంలో ఒకే ఒక్క బ్యాంకులో 'అప్‌డేట్' సేవలు
- ఉదయం నుంచీ పడిగాపులు
- పోస్టాఫీసు, నెట్‌సెంటర్ల వద్ద బారులు
- సాంకేతిక సమస్యతో ఇబ్బందులు



సోంపేట : ఆధార్ సెంటర్ వద్ద రద్దీ ఇలా..



శ్రీకాకుళంలో బ్యాంకు వద్ద 'ఆధార్' సేవల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

శ్రీకాకుళం అర్బన్/ సోంపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు 'ఆధార్' కష్టాలు తప్పడం లేదు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేసింది. 'ఆధార్'లో పేర్లు, వివరాలు తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలని సూచించింది. ఇందులో భాగంగా ఐదేళ్లు దాటిన చిన్నారుల వేలిముద్రలు అప్‌డేట్ చేసేందుకుగానూ రేషన్‌కార్డుదారులు 'ఆధార్' కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. శ్రీకాకుళంలోని కర్ణాటక బ్యాంకులో మాత్రమే ఆధార్ అప్‌డేట్ సేవలకు అవకాశం కల్పించారు. అదీ రోజుకు 30మంది ఐదేళ్లలోపు చిన్నారులకు మాత్రమే వేలిముద్రలు, వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచీ సాయంత్రం వరకు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం కూడా ఉదయం 7గంటలకే బ్యాంకు వద్దకు కొంతమంది ప్రజలు చేరుకున్నారు. కాగా.. ఆర్థిక సంవత్సరం ముగింపు పేరిట మంగళవారం బ్యాంకులకు వర్కింగ్ హాలీడే ప్రకటించారు. బ్యాంకు తెరవకపోవడంతో చాలామంది గంటల తరబడి నిరీక్షించి.. నిరాశతో వెనుదిరిగారు. అలాగే 'ఆధార్'లో సమాచారం, పాఠశాలలో నమోదు చేసిన సమాచారం ఒకేలా ఉండాలన్న నిబంధనతో విద్యార్థులకు మరిన్ని కష్టాలు తప్పడం లేదు. పోస్టల్ కార్యాలయాలు, ఇతర నెట్ సెంటర్ల వద్ద కూడా 'ఆధార్' అప్‌డేట్ కోసం ప్రజలు బారులుతీరుతున్నారు. సోంపేట పోస్టాఫీసులోని ఆధార్ సెంటర్ వద్ద మంగళవారం ప్రజలు ఎండలోనే క్యూ కట్టి అవస్థలు పడ్డారు. గంటల తరబడి నిరీక్షించినా సాంకేతిక సమస్యల కారణంగా 'ఆధార్'లో వివరాలు అప్‌డేట్ కాక అసహనం చెందారు. తమ కష్టాలను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆధార్ అప్‌డేట్ కేంద్రాల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.



శ్రీకాకుళం : ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

ముగిసిన పదో తరగతి పరీక్షలు

- చివరిరోజు 28,254 మంది హాజరు

గుజరాతీపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసాయి. చివరిరోజు సాంఘికశాస్త్రం పరీక్ష నిర్వహించారు. రెగ్యులర్‌కు సంబంధించి 28,276 మంది విద్యార్థులకుగాను 28,147మంది హాజరయ్యారు. 129మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటుకు సంబంధించి 129మందికిగాను 107మంది హాజరు కాగా, 22మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 28,254మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం 12.45గంటలకు పరీక్ష ముగియగానే.. కేంద్రాల నుంచి విద్యార్థులు ఉల్లాసంగా బయటకొచ్చారు. తోటి విద్యార్థులతో తీపి జ్ఞాపకాలు పంచుకుంటూ.. వీడ్కోలు చెప్పుకున్నారు. హాస్టల్ విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

జీవన వేదం.. ఈ తుంబుర సొంతం

- రామాయణ, భారతం వినిపించే ఎరుకల కులస్థులు
- కనుమరుగవుతున్న సంప్రదాయ కళ

పలాస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి)

'ఏమి చేతును తమ్ముడా... ఏమి చేతును రామా... లేడి వెంట వెళ్లినప్పుడు.. అది మాయలేడి అని చెప్పాను కదా రామా.. రామచంద్రా నా మాట విన్నావా?'... అంటూ వేకువజామున తుంబుర చేత పట్టుకొని యాచించే వారిని మీరు గుర్తించారా... వారే ఎరుకల సామాజికవర్గం వారు. వారి వద్ద ఉన్న తుంబుర చూడడానికి సాధారణంగా కనిపించినా... సప్తస్వరాలను అలవోకగా పలుకుతుంది. అది ప్రజల జీవన విధానానికి అద్దం పట్టే రాగాలు పలుకుతుంది. వారి కంఠం శ్రావ్యంగా రామాయణం, మహాభారతం, సుందరకాండలను వినిపిస్తుంది. ఒకప్పుడు నిత్యం



గుమ్మడి పండుతో తయారు చేసిన తుంబుర

గ్రామాల్లో వినిపించే ఈ సంగీత మాధుర్యం... ప్రస్తుతం అప్పుడప్పుడు మాత్రమే వినిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అనేక మండలాల్లో ఎరుకల కులస్థులు ఉన్నారు. మహిళలు గ్రామాల్లో సోది చెబుతామన్న సోది అని తిరుగుతూ యాచిస్తుంటారు. మరికొంతమంది మహిళలు చిన్నపిల్లలకు కావాల్సిన దిష్టిపూసలు, కొబ్బరి, ఈతకొమ్మలతో చేసిన బుట్టబొమ్మలు అమ్ముకుంటూ జీవిస్తుంటారు. పురుషులు మాత్రం ఎక్కువగా గ్రామాల్లో రామాయణ, భారతాలు, స్వతంత్ర సమర యోధుల గాథలు, సుందరకాండ వంటివి శ్రావ్యంగా పాడుతూ... ప్రజల మెప్పు పొంది... డబ్బులు ఆర్జిస్తుంటారు. అంతరించిపోతున్న జానపద కళల్లో ఎరుకల వృత్తులు వారివీ ఉన్నాయంటే సందేహమే లేదు. గ్రామాల్లో ప్రస్తుతం వీరిని ఆదరిస్తున్నారు. కానీ పాడేవారి సంఖ్య తగ్గిపోతోంది. 50 ఏళ్ల దాటిన వారే మనకు కనిపిస్తున్నారు.

మిగిలిన వారు కులవృత్తులు వీడి... పట్టణాల్లో బతికేందుకు వలసలు వెళ్లిపోతుండడంతో వారి సంఖ్య తగ్గిపోతుంది. శ్రీకాకుళం జిల్లాలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, పొందూరు, ఆమదాలవలస, పోలాకి, ఎల్ఎన్.పేట, వంగర, పాతపట్నం, హిరమండలం వంటి ప్రాంతాల్లో అధికంగా ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతుండడం గమనార్హం.

చదువు లేకపోయినా...

ఎరుకల రామాయణం ఎంతో ప్రాచుర్యం పొందిన జానపద కళ. కనీస అక్షర జ్ఞానం లేకపోయినా రామాయణ, భారతాలను విని ఎంతో చక్కగా వీరు పాడుతూ యాచిస్తుంటారు. అత్యధిక శాతం పెద్దల నుంచి విని..నేర్చుకున్నదే. రామాయణ కథను చెప్పడం, గేయ రూపంలో ఆలపించడం, వాటికి తుంబుర, చిడతలు, మువ్వలతో చిన్నపాటి సంగీతాన్ని అందిస్తూ ఆలపిస్తుంటే... ఎవరైనా మయమరచిపోవడం ఖాయం. వీరు కూడా సొంతంగా పాటలకు బాణీలు కడుతూ ఆలపిస్తుండడం విశేషం. సులభమైన భాషలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఆలపించడం ఎరుకల కులస్థుల ప్రత్యేకత. ముఖ్యంగా ఎరుకల రామాయణాన్ని తమదైన శైలిలో హాస్యాన్ని రంగరించి చెప్పడం విశేషం.

ఎంతో ప్రత్యేకం..

ఎరుకల రామాయణం, భాగవతానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఎరుక అంటే భూత, భవిష్యత్, వర్త మాన కాలాల మనుగడ అనే అర్థం వస్తుంది. ఎరుకల కుల స్థులకు మొత్తం జాతక చక్రమంతా తెలుస్తుందని అంతా నమ్ముతుంటారు. మన జిల్లాలో రామాయణ, మహాభారతాలతో పాటు శకుని పాట, శివతాండవం, రామదాసు బందిఖానా వంటి పాటలు కూడా పాడుతారు. తుంబురతో పాటు వాయులీనాన్ని సొంతంగా తయారు చేసుకొని వాటితో రాగాలు తీస్తూ యాచిస్తుంటారు. ఎరుకల రామాయణం పాడే కళాకారులను గుర్తించి... రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా నివాసం ఉండే ఎరుకల వారి సామాజిక స్థితిగతులపై అధ్యయనం చేసి ఆర్థిక తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉంది.



వీధుల్లో యాచిస్తున్న ఎరుకల రామాయణం కథకుడు గొర్లె త్రినాథరావు



మళ్లీ మోగనున్న బాజాలు

- 6 నుంచి వివాహ ముహూర్తాలు
- అంతటా సందడి

శ్రీకాకుళం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల విరామం తరువాత ఈ నెల 6వ తేదీ నుంచి వివాహ శుభకార్యాలు మళ్లీ జరుగనున్నాయి. మార్చి 18 నుంచి మూఢమి కావడంతో 11 రోజుల పాటు శుభకార్యాలకు మంచి ముహూర్తాలు లేవు. మళ్లీ ఈ నెల 6 నుంచి బాజాలు మోగనున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి 6, 16, 18, 20, 23, 30 తేదీలలో ముహూర్తాలు ఉన్నాయి. మే నెలలో 1, 8, 9, 11, 17, 18, 28 తేదీలు, జూన్‌లో 1, 2, 5, 6, 7, 8 తేదీలు, జూలైలో 16, 30 తేదీలు, ఆగస్టులో 1, 4, 7, 8, 9, 10, 13, 14, 17 తేదీలు, సెప్టెంబరులో 26, 27 తేదీలు, అక్టోబరు నెలాఖరు వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఆ తరువాత మళ్లీ 2026 ఫిబ్రవరి, మార్చి, జూన్, జూలై, ఆగస్టు, నవంబరు నెల వరకు ముహూర్తాలు ఉన్నాయి. వివాహాల దృష్ట్యా వేసవిలో పలువురికి ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి.

అలా నిర్మించి.. వదిలేశారు

(ఐదో పేజీ తరువాయి)

సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు రెండు, జనరల్ మెడిసన్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పోస్టులు నాలుగు ఖాళీగా ఉన్నాయి. యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు రెండు ఉండాల్సి ఉండగా.. ఒకరు మాత్రమే ఉన్నారు. అనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్లు నలుగురికిగానూ ఉన్నది కేవలం ఒక్కరే. రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, పాథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్, న్యూట్రిషనిస్ట్ లేరు. జనరల్ కాజువల్ మెడికల్ ఆఫీసర్లు 12 మందిని భర్తీ చేయాల్సి ఉంది. రీసెర్చ్ ల్యాబ్‌లో రెండు ప్రాజెక్టు మేనేజర్ పోస్టులు ఖాళీ. రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టులు రెండు ఖాళీ. అలాగే ఇద్దరేసి సీనియర్ రీసెర్చ్, జూనియర్ రీసెర్చ్‌లు ఖాళీ. డయాలసిస్ టెక్నీషియన్లు పది మందికిగానూ నలుగురు మాత్రమే ఉన్నారు. మొత్తం అన్ని విభాగాలు కలిపి.. 206 మంది ఉండాల్సి ఉండగా.. 129 మంది ఉన్నారు. 77 పోస్టులు ఖాళీ. రెగ్యులర్‌గా ఉండాల్సిన 27మంది వైద్యులు, కాంట్రాక్టు పద్ధతిలో ఉండాల్సిన 22 మంది వైద్యులు ఇప్పటికీ లేకపోవడం వల్ల కిడ్నీ రోగులకు ఏ విధమైన సేవలు లభిస్తాయి.. ఇక్కడ పరిశోధనలు ఎలా జరుగుతాయన్నదీ ప్రశ్నార్థకమవుతోంది. ఇక్కడ పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి(రిమ్స్-జీజీహెచ్) వెళ్లాల్సి వస్తోందని కిడ్నీ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి కిడ్నీ పరిశోధన కేంద్రానికి అవసరమైన సిబ్బందిని నియమించి.. సేవలు మెరుగుపరచాలని కోరుతున్నారు.

సేవలు మెరుగుపడుతున్నాయి

గత ప్రభుత్వంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అని చెప్పుకున్నా.. డయాలసిస్ కేంద్రంగానే సేవలు అందేవి. అవసరమైన సిబ్బంది, పరికరాలు లేకపోవడం వాస్తవమే. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు తెలియజేశాం. మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లాం. ఇప్పుడిప్పుడే సేవలు మెరుగుపడుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఆశించినస్థాయిలో పని చేసేలా చర్యలు చేపడుతున్నాం.

- గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

'కన్నీళ్ల'పేట!

(ఐదో పేజీ తరువాయి)

ముందుకు వచ్చి...కెరటాలు ఉధృతంగా ఉన్నాయని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. సాధారణంగా అమావాస్య, పౌర్ణమి వేళల్లో సముద్రం ఆటుపోట్లలో మార్పులు ఉంటాయని చెప్పారు. ఇప్పుడు సాధారణంగానే ఉంటాయని.. చీకట్లో అలల తీవ్రతను అంచనా వేయలేకపోయామని వాపోయారు.

పెద్ద దిక్కులు కనిపించక...

గల్లంతైన మత్స్యకారులు తమ కుటుంబాలకు పెద్దదిక్కుగా ఉంటున్నారు. వీరు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బొంగు ధనరాజుకు భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇందులో చిన్న కుమార్తె వయసు కేవలం నాలుగు నెలలే. వంక కృష్ణ కుటుంబానిదీ అదే పరిస్థితి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి గల్లంతైన వార్త తెలిసి పిల్లలు రోదిస్తున్న తీరు వర్ణనాతీతం.



రోదిస్తున్న వంక కృష్ణ కుటుంబ సభ్యులు, బంధువులు



పద్మనాభపురంలో కాపులేని మామిడి తోట

పూత ఏదీ?

(ఐదో పేజీ తరువాయి)

కనీసం 40 శాతం పంటయినా వచ్చేది. ప్రస్తుతం మాత్రం పూత దశలోనే మాడిపోవడంతో పంటంతా నాశనమైంది. బంగినపల్లి, కలెక్టర్, దేశవాళీరకాల మామిడిని ఇక్కడ ఎక్కువగా పండిస్తారు. ఎటువంటి రసాయనాలు లేకుండా పండించే పలాస డివిజన్‌లో మామిడి పంటకు ఎంతో గిరాకీ ఉంది. జీడితో పాటు మామిడి, పనస కూడా పండిస్తారు. పనస దిగుబడి బాగున్నా.. మామిడి మాత్రం ఆశించినంతగా రాలేదు. కేవలం మామిడి పంటపై ఆధారపడే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. డివిజన్‌లో ఎక్కువగా రైతులు మామిడి తోటలను గుత్తకు(కాంట్రాక్ట్) ఇస్తారు. ఎకరా రూ.20వేల నుంచి రూ.40వేలు వరకూ వేలం పాట పాడుకుంటారు. పూతదశ లోనే చుట్టుపక్క ప్రాంతీయులు తోటలను తీసుకొని అక్కడే నివాసం ఉంటూ మామిడి పంటను కాపాడుకుంటారు. కాగా ఈ ఏడాది పంట దిగుబడి లేకపోవడంతో తోటలను కొనుగోలు చేసినా కాపలా ఉండే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కో చెట్టుకు పది నుంచి 20 కాయలు మాత్రమే రావడంతో తీవ్ర నిరాశతో ఉన్నారు. ఎకరాకు పది కిలోలు కూడా వచ్చే పరిస్థితి లేదని కాపలాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పలాస మార్కెట్‌కు రాజమండ్రి, తుని, ఒడిశా నుంచి మామిడికాయలు దిగుమతి అవుతున్నాయి. కిలో రూ.60 నుంచి రూ.100 వరకూ విక్రయిస్తున్నారు.

కొలువులో చేరిన రోజే.. మరో రెండు ఉద్యోగాలు

- అలుదు యువకుడి ప్రతిభ



జగదీష్ కుమార్

సారవకోట (జలుమూరు), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన యువకుడు అరుదైన ఘనతను సాధించాడు. ఐబీపీఎస్ నిర్వహించిన పరీక్షల్లో అలుదుకు చెందిన కత్తిరి జగదీష్ కుమార్ ఏకకాలంలో రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. మంగళవారం బ్యాంకు ఉద్యోగాలకు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాకు పీవోగా, ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం)కి స్పెషల్ అధికారిగా రెండు ఉద్యోగాలకు ఆయన ఎంపికయ్యాడు. ఇటీవల రాయలసీమలోని ఆంధ్రప్రగతి వికాస గ్రామీణ బ్యాంకు ఉద్యోగానికి జగదీష్ కుమార్ ఎంపికయ్యాడు. అనంతపురం జిల్లా గూగూడులోని కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. అదే రోజు మరో రెండు కొలువులకు ఎంపికైనట్టు సమాచారం అందుకున్నాడు. జగదీష్ తండ్రి జనార్దనరావు రైతు కాగా, తల్లి వాణికుమారి గృహిణి. ఒకటి నుంచి ఇంటర్ వరకు నరసన్నపేటలో చదివాడు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ చదివి.. బ్యాంకు కొలువులకు విజయవాడలో శిక్షణ పొందినట్టు జగదీష్ తెలిపాడు. జగదీష్ ఎంపిక పట్ల తల్లిదండ్రులు, సోదరుడు కిషోర్, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

పశువుల దాహార్తి తీర్చేందుకు చర్యలు



భూమి పూజ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- నీటి తొట్టెల నిర్మాణాలు ప్రారంభం
- 16 పంచాయతీల్లో ఏర్పాటు

నరసన్నపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం తామరాపల్లి గ్రామంలో నీటి తొట్టెల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పశువుల పెంపకం ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ.30 వేల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నీటి తొట్టెల నిర్మాణంతో పాటు వాటిలో పశువులు తాగేందుకు నీరు అందుబాటులో ఉంచనున్న ట్టు తెలిపారు. మండలంలోని 16 పంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్పీడీవో మధుసూధనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఏపీవో యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... తామరాపల్లి గ్రామంలో ఏటా వేసవిలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంటోందని స్థానిక మహిళలు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. భూగర్భ జలాలను పెంచేందుకు ఇళ్ల వద్ద ఇంకుడు గొయ్యిలను తీసుకోవాలని మహిళలకు సూచించారు.

వీడలేమంటూ.. వీడుకోలంటూ..

- ముగిసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్ష పూర్తయ్యాక విద్యార్థులు సంబంధిత కేంద్రాల వద్ద సందడి చేశారు. కేరింతలు కొట్టారు. కొందరైతే... స్నేహితులతో విడిపోతున్నందుకు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ... బరువెక్కిన హృదయాలతో ఇంటి బాట పట్టారు.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళంలో ఇలా..



శ్రీకాకుళంలో స్నేహితులకు టాటా చెబుతున్న విద్యార్థులు



ఫోన్‌లో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు



శ్రీకాకుళం ప్రభుత్వ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల ఆనందం



వజ్రపుకొత్తూరు: నగరంపల్లి కేంద్రం నుంచి బయటకు వస్తూ..



నరసన్నపేటలో విజయకేతనం చూపుతున్న విద్యార్థినులు



టెక్కలిలో పరీక్ష రాసి బయటకు వస్తూ..

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

● మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రాంగణంలో అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల పరిశ్రమలు తరలిపోవడమే కాకుండా కొత్త పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదని విమర్శించారు. సాంకేతికంగా వస్తున్న మార్పులను అనుగుణంగా యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేదిశలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇందులో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఫార్మా రంగానికి సంబంధించి ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్‌ల ఏర్పాటుకు సీఎం సానుకూలంగా ఉన్నారన్నారు. దీనివల్ల విద్యతో పాటు ఫార్మా రంగంలో ఉద్యోగావకాశాలు పొందేందుతాయన్నారు. ఈ మెగా జాబ్‌మేళాలో సుమారు 36 సంస్థలు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా నైపుణ్యా భివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ నాయకులు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, పూజారి శైలజ, ఎస్.శ్రీనివాస్, కర్రి అప్పారావు, ప్రిన్సిపాల్ సంతోషి పాల్గొన్నారు.

ఒడియా మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


యజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఒడియా మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం రాత్రి ఇచ్ఛాపురంలోని బాపూజీ ఒడియా పాఠాఘర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడో అధ్యక్షతన 90వ ఉత్కళ్ దివస్ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీలో రెండు సార్లు ఒడియా మైనార్టీల సమస్యలపైప్రశ్నించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒడియా డీఐదుర్గాప్రసాద్, ఉత్కళాంధ్ర జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సత్యనారాయణపాడి, ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బృందావన్ దొళై, శివప్రసాద్, ఎంఈవో-1, 2 అప్పారావు, విశ్వనాథం, పరపటి మంజులత, నందికి జాని, కాళ్ల దిలీప్ పాల్గొన్నారు.

మహామంత్ర యజ్ఞం విజయవంతం చేయాలి

బెల్లుపడలో ఈనెల 19 నుంచి ఐదురోజులపాటు నిర్వహించనున్న శ్రీరామతారకమహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. మంగళవారం మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞానికి శుభరాట వేశారు. ఈ సందర్భంగా అశోక్ అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఐదురోజులు పాటు జరగనున్న యజ్ఞం విజయవంతంగా జరిగేందుకు అధికారులు సహకరించాలని తెలిపారు. యజ్ఞంలో పాల్గొవడానికి వేలాది భక్తులు రానుండడంతో వాహనాలు హైవేగుండా సుమాడిమీదుగా మళ్లించాలని పోలీసులకు సూచించారు. అనంతరం యజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, మునిసిపల్ కమీషనర్ రమేష్,విద్యుత్ శాఖ ఏఈ గోవిందరావు, గ్రామ పెద్దలు ఆశి జీవులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి: ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలోని డీసీసీబీకాలనీ పరిసర ప్రాంతాల్లో నగరపాలకసంస్థ కమిషనర్, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న రెండు, మూడు నెలల్లో యుద్ధ ప్రాతిపదికన నగరంలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసి, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని తెలిపారు.

● గార ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):వాడాడలో ఉపాధి పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న పశువులు మంచినీటి కుంటలు నిర్మాణానికి ఎమ్మెల్యే గొండు శంకర్ భూమి పూజ చేశారు.అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, ఏపీవో సంధ్యారాణి, జేఈ నారన్నాయుడు పాల్గొన్నారు.

రూ 80 కోట్లతో అభివృద్ధి పనులు

లావేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది నెలల్లో రూ.80 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని గుమడాంలో నమస్తే ఎచ్చెర్ల, మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమం టీడీపీ మండలాధ్య క్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన జరిగింది. రాబోయే ఏడాదిలోపు రూ 80 కోట్లుతో జలజీవన్ పథకంలో భాగంగా అన్నీ గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరందిస్తామని తెలిపారు.

120 షాపులకు తాళాలు.. 300 కుళాయి కనెక్షన్ల తొలగింపు

● 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.26.75 కోట్ల పన్నుల వసూలు

● ఇదీ శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పరిస్థితి

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆర్థికసంవత్సరంలో ఇంటి, కుళాయి,ఆస్తి పన్నులకు సంబంధించి గత నెల 31వ తేదీకి రూ.26.75కోట్ల పన్నులను వసూలు చేశారు. ఇప్పటికీ పన్నులుచెల్లించని 120షాపులకు కార్పొరేషన్‌అధికారులు తాళాలు వేయగా, 300కు పైగా కుళాయి కనెక్షన్లను తొలగించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్లు పన్నులు మా త్రమే వసూలయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.6.75కోట్లు అధికంగా వసూలు జరిగాయని అధికారులు తెలిపారు. ఈఏడాది మార్చి 30,31 తేదీల్లో ఉగాది,రంజాన్ పండుగలు వచ్చినా కమిషనర్ పీవీవీ ప్రసాదరావు, నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసిన విషయం విదితమే. మార్చి 31వ తేదీ ఒక్క రోజునే రూ.1.26కోట్లు పన్నులు ప్రజలు చెల్లించడం విశేషం. కొద్దిరోజులుగా రాష్ట్రప్రభుత్వం 50శాతం వడ్డీరాయితీ కల్పించడంతో ప్రజలు ఆస్తి పన్ను చెల్లించేందుకు పెద్ద ఎత్తున ముందుకువచ్చారు. కాగా గత ఏడాది కార్పొరేషన్ పరిధిలో 23వేలమంది పన్నులు చెల్లించగా, ఈ ఏడాది 35,800 మంది పన్నులు చెల్లించారు. ఈ సందర్భంగాకమిషనర్ కమిషన్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి, ప్రజలకు అవగాహన కల్పించి పన్నులను వసూలు చేసినట్లు తెలిపారు.

‘ఉపాధి’లో జిల్లాకు గుర్తింపు: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమలులో గతనెల 31తో ముగిసిన 2024 -25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అనేక కాంపోనెంట్లలో ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకుగుర్తింపు, గౌరవం దక్కిందని తెలిపారు. 2025-26 సంవత్సరంలో పంచ ప్రాధాన్యాలుగా ప్రణాళిక తయారు చేశామని పేర్కొన్నారు.ఈ ప్రణాళిక అంచనా విలువ రూ.1499.03 కోట్లతో 41,523పనులు గుర్తించామని పేర్కొన్నారు. ఈపనులతో వేత నదారులకు ఉపాధి,గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అసిరితల్లికి పూజలు


కవిటిలో చింతామణి అమ్మవారి ప్రతిరూపాలను ఊరేగిస్తున్న భక్తులు

జి.సిగడాం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటలో చెవిటిపోలమ్మ అసిరి తల్లికి మంగళవారం గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ముర్రాటలు చెల్లించుకున్నారు. గ్రామంలో శివాలయం పనుల ప్రారంభించనున్నారు. దీంతో తొలుత చెవిటిపోలమ్మతోపాటు బండార్లమ్మ, నీలమ్మ, కనకదుర్గమ్మతల్లికి మహిళలు ముర్రాటలు చెల్లించి, పూజలు నిర్వహించారు.

కవిటిలోని చింతామణికి చల్లదనం

కవిటి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): కవిటిలోని చింతామణి అమ్మవారికి మంగళవారం భక్తులు చల్లదనం కార్యక్రమాన్ని నిర్వహించారు.చైత్రమాసంలో అమ్మవారికి ఉత్సవాన్ని చేపట్టి పూజలు చేపట్టడం సంప్రదాయంగా వస్తోంది. మంగళవారం సొండికులసంక్షేమ సంఘ అధ్యక్షుడు పి.రామారావు, పి.చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఉత్సవాన్ని ఘనంగా చేపట్టారు.

డీసీఎంఎస్ పరిశోధకులకు వైవా

ఎచ్చెర్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుంట తులసీరావు పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్‌కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీసీఎంఎస్) పరిశోధన చేసిన ఇద్దరికి మంగళవారం వైవా నిర్వహించారు. కోస్తాంధ్ర జిల్లాలో గిరిజనులు భాగస్వామ్యవుతున్న ఎన్ఆర్ఈజీఎస్ అమలులో బ్యాంకులు, ఇన్సూరెన్స్ అంశంపై దంతులూరి రమేష్, చెన్నైలోని ఐటీ, సంబంధిత శాఖల్లో ఉద్యోగులు నిష్క్రమించకుండా మానవ వనరుల నిర్వహణ ద్వారా చేపట్టే చర్యలపై భాస్కర వెంకట రమణ పరిశోధన చేశారు.వీరిద్దరూ వర్సిటీకి సమర్పించిన సిద్ధాంత గ్రంథాలు సంతృప్తికరంగా ఉండడంతో వర్సిటీలో వీరికి వైవా వేర్వేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంఎస్ బోర్డ్ స్టడీస్ ఛైర్మన్ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, అకడమిక్ డీన్ కె.స్వప్నవాహిని పాల్గొన్నారు.

యాదాద్రిలో బాలికల నృత్య ప్రదర్శన

ఆమదాలవలస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసకు చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేతన్ విద్యార్థులు తెలంగాణలోని యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ప్రభుత్వం నిర్వహించిన ఉగాది వేడుకల్లో నృత్య ప్రదర్శన నిర్వహించారు. నృత్య విద్యార్థులు సుస్మిత హిమశ్రీ, పవనసాయి, లాస్యప్రియ, జ్ఞాన శ్రీవల్లి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారని నృత్య శిక్షకురాలు ఏలేశ్వరం శ్రీనివాసులు శిష్యురాలు కూన శ్రీలత తెలిపారు.

వివరాలు తెలియజేస్తే నగదు పురస్కారం: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం/జలుమూరు,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని జలుమూరు మండలంలోని వివిధ ఆలయాల గోడలపై మార్చి29వ తేదీ రాత్రి విద్వేషాలు రేపేలా రాతలు రాసిన వారి వివరాలు తెలియజేసిన వారికి రూ.25వేల నగదు పురస్కారం అందించనున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆలయ గోడలపై రాసిన రాతలకు సంబంధించిన వ్యక్తుల వివరాలు తెలిస్తే 6309990800, 6309990803, 6309990804, 6309990815, 6309990848, 6309990886 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

4,5 తేదీల్లో జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):జిల్లాస్థాయి క్రికెట్ జట్ల ఎంపికలు చిలకపాలెంలో ఈనెల 4, 5 తేదీల్లో వేర్వేరు విభాగాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్ రాజా షేక్ తెలిపారు.ఈ సీజన్‌కు సంబంధించి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లలో ప్రాతినిధ్యం వహించనున్న సీనియర్ పురుషుల వన్డే, టి-20 జట్ల ఎంపికలు ఈ నెల 4, ఈనెల 5న అండర్-19 విభాగంలో వన్డే పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి

సరుబుజ్జిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని సరుబుజ్జిలి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కన్వీనర్, కోకన్వీనర్లు దవళ సింహాచలం, తులగాపు ధనుంజయరావు కోరారు. ఈమేరకు ఎంపీడీవో ఎం.పావనికి మంగళవారం వినతిపత్రం అందించారు.



అరసవల్లి: నగరపాలకసంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు


ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆప్కాస్‌ను రద్దు చేయవద్దు

● కార్మికులను పర్మినెంట్ చేయాలి ● జిల్లాలోని మునిసిపల్ కార్మికుల నిరసన

ఆప్కాస్‌ను రద్దు చేయవద్దని, కార్మికులను పర్మినెంట్ చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. మంగళవారం జిల్లాలోని శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీల్లో కార్మికులు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు.

● అరసవల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలను ప్రభుత్వం వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి నుంచి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంవరకు కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కె.రాజు, రాము, గురుస్వామి, ఏ.శేఖర్, జె.మాధవి,శంకర్ గణేష్ పాల్గొన్నారు.

● ఆమదాలవలస, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):ఏజెన్సీలకు అప్పగించి తమ జీవితాలను నాశనంచేయవదని మునిసిపల్‌యూనియన్ నాయకుడు తాడిసంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పాలపోలమ్మ ఆలయం దగ్గర నుంచి వన్‌వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు మునిసిపల్ కార్మికులు ఆప్కాస్‌ను రద్దును నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు పీవీవీకే రాజు, తమ్మినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్య క్రమంలో మునిసిపల్ కార్మికులు ఎస్.రాజేష్, ఎ.శ్రీనివాస్, కె.తారక, జె.శ్రీను, కె.ఈశ్వరరావు, డి.రాజేష్ పాల్గొన్నారు.



ఆమదాలవలస: ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

● ఇచ్ఛాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీసీఓఎస్ రద్దు చేస్తే మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మునిసిపల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏపీసీఓఎస్ రద్దు నిర్ణయం ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఇచ్ఛాపురం శాఖ ప్రతినిధులు రమేష్‌పట్నాయక్, మంగళసత్తు, గోంగాదర్ రాథో, లక్ష్మణరావు, డిల్లీ పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డీఈవో తిరుమల చైతన్యపై శాఖాపరమైన చర్యలుతీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు.ఈ మేరకు మంగళవారం ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐక్య ఉపాధ్యాయ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ పి.రాంబాబుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలంలోని కుప్పలి మోడల్ స్కూల్‌లో పదోతరగతి పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేసి, అక్రమంగా కేసులు పెట్టారని, వెంటనే సస్పెన్షన్లను రద్దు చేసి ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌వీ రమణ, టీవీటీ భాస్కరరావు, బొడ్డేపల్లి గోపీచంద్, చింతాడ వెంకటరమణమూర్తి, కింతలి చంద్రరావు, పేడాడ అన్నాజీ, బి.సూర్యనారాయణ, మెండ శ్యామలరావు, బొడ్డేపల్లి రమేష్, పైడి రాజు రవికుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంతువు సంచారం

● ఆందోళన చెందుతున్న కొర్ని, పరిసర గ్రామాల ప్రజలు


కొర్ని రోడ్డు సమీపంలో గల పంట పొలాల్లో గుర్తుతెలియని జంతువు పాద ముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

గార ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొర్ని రోడ్డు సమీపంలోగుర్తుతెలియని జంతువుసంచరిస్తుందన్న వదంతులతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి ఈ రోడ్డు దగ్గరలో గుర్తుతెలియని జంతువును కొందరు చూసినట్లు చెపుతున్నారు. ఈనేపధ్యంలో మంగళవారం ఉదయం ఫారెస్ట్ సెక్షన్ అధికారులు రాంబాబు, జగన్మోహనరావు, తదితర సిబ్బంది స్థానికులతో కలిసి కుమ్మరిపేట, కరణాలపేట, కొర్ని రోడ్డు ప్రాంతాలు, మొక్కజొన్న పొలాలు, తోటలు పరిశీలించారు. రాత్రి వేళ ఒకరుగా వెళ్లరాదని, టార్చ్‌లైట్ తీసుకొని వెళ్లాలని, గుర్తు తెలియని జంతువు పాదముద్రలు కనిపించినా ఎక్కడైనా పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలను చంపి తిన్నట్లు ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం తెలియచేయాలని అటవీశాఖ అధికారులు కోరారు.

కవితల పోటీల్లో రాజారావుకు బహుమతి

ఆమదాలవలస, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):ఆమదాలవలసకు చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావుకు తెలంగాణలోని పాల్వంచ కళా పరిషత్ నిర్వహించిన కవితల పోటీల్లో ద్వితీయ బహుమతి లభించింది.ఈ మేరకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అంశంపై రచించిన హృదయంలో కృత్రిమ ముల్లు కవిత ఎంపికచేశారని పాల్వంచ కళా పరిషత్ కార్యదర్శి వేముల కొండలరావు సమాచారం పంపినట్లు రాజారావు తెలిపారు.

చర్చిపై రాతలతో కలకలం

శ్రీకాకుళం క్రైం ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ చర్చిపై గుర్తు తెలియని వ్యక్తుల రాతలతో కలకలం రేగింది. మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో చర్చి గోడలుపై నాలుగు చోట్ల పెయింటింగ్‌తో ఓ దేవుడి పేరు రాశారు. ఈ విషయాన్ని గుర్తించిన రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ పి.ఈశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చర్చిలో సీసీ కెమెరాలు ఉండటంతో వాటిని పరిశీలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం జలుమూరు మండలంలో ఒక ఆలయంపై అన్యమత రాతల ఘటన మరువకముందే శ్రీకాకుళంలో ఈ ఘటన చోటుచేసుకోవడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మతవిద్వేషాలు సృష్టించేందుకే ఈ చర్యలు చేపట్టి ఉంటారని వారు భావిస్తున్నారు. దీనిపై సీఐ ఈశ్వరరావును వివరణ కోరగా చర్చిలో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. కాగా 9.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వాహనంపై వచ్చి గోడలపై రాసినట్లు చెబుతున్నారు.

ఐక్యంగా సంక్షేమానికి పాటుపడాలి

కవిటి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):కవిటిలో సామాజికభవన నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులను విడుదల చేస్తానని శ్రీకాకుళం జడ్పీ ఛైర్‌పర్సన్ పి.విజయ ప్రకటించారు. మంగళవారం కవిటిలో శ్రీకృష్ణభార్గవ కాళింగసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ ఐక్యతగా నిలిచి కులసంక్షేమానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రాజేష్, సంఘ అధ్యక్షుడు బి.రమణమూర్తి, సర్పంచ్ పి.లక్ష్మణరావు, ఎంపీటీసీ పి.నీలాచలం పాల్గొన్నారు.

డిప్యుటేషన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):వమ్మరవల్లిలోని డైట్‌లో డిప్యుటేషన్‌పై పోస్టులు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఎంఈవోలు, హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డైట్‌లో వివిధ విభాగాల్లో ఐదుసీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. భర్తీ చేసేందుకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియమించేలా ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.ఈ నెల పదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష 16, 17న, ఇంటర్వ్యూ 19న ఉంటుందని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

పొందూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పొందూరు, జి.సిగడాం మండలాల ఎస్సీ, ఎస్టీ సంక్షేమసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీర రాము, రేగిడి సతీష్‌ఎన్నికయ్యారు. పొందూరులో రెండు మం డలాల సభ్యులతో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు.

ట్రేడ్ లైసెన్స్ అనుమతి లేని షోరూం సీజ్

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఇలిసిపురం సమీపంలో ఉన్న ధర్మాన టీవీఎస్ షోరూముకు ట్రేడ్ లైసెన్స్ అనుమతి లేకపోవడంతో మంగళవారం నగరపాలక అధికారులు సీజ్ చేశారు. ట్రేడ్ లైసెన్స్ అనుమతి పొందకుండా ప్రారంభించిన విషయం తెలుసుకున్న నగరపాలక కమిషనర్ సీజ్ చేయాలని ఆదేశాల మేరకు సీజ్ చేశారు. షోరూముకి సంబంధించి ట్రేడ్ లైసెన్‌లకు అర్జీ పెట్టలేదని, దీనిపై నోటీసులు జారీ చేశామని కమిషనర్ ప్రసాదరావు తెలిపారు.నోటీసులకు స్పందించకపోవడంతో హెల్త్ ఆఫీసర్ సీజ్ చేశారని చెప్పారు.

తుప్పుపట్టి.. నిరుపయోగంగా..

● ఇదీ గారలో రెండు పవర్ జనరేటర్ల పరిస్థితి


పాత రెవెన్యూ కార్యాలయం వద్ద తుప్పుపట్టిన జనరేటర్

గార, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గారలోని పాత రెవెన్యూ కార్యాలయం వద్ద పదేళ్ల కిందట ఏర్పాటుచేసిన రెండు పవర్‌జనరేటర్లు నిరుపయోగంగామారాయి. ప్రసుతం వినియోగం లేకపోవడంతో తుప్పుపట్టి పాడయ్యాయి.అప్పట్లో కార్యాలయంలో కంప్యూటర్లు నిర్వహణ కోసం ఇక్కడ పవర్ జనరేటర్లు ఏర్పాటుచేశారు. తర్వాత అధికారుల నిర్వహణలోపం వల్ల ఈ జనరేటర్లు వినియోగించకపోవడంతో ఆరు బయట ఎండకు ఎండి వర్షానికి తడిచి పాడయ్యాయి. రెండేళ్ల కిందట ఇక్కడ రెవెన్యూకార్యాలయం కొత్త భవనంలోకి మార్చిన విషయం విదితమే. అయితేఈ జనరేటర్లు ఇక్కడే వృథాగా విడిచిపెట్టేశారు.లక్షలాది రూపాయలు వ్యయంతో కొనుగోలు చేసిన జనరేటర్లు వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు అధికారులను కోరుతున్నారు.

ధరణికి బాలరత్న పురస్కారం

ఎచ్చెర్ల,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాడ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఎలినాటి ధరణికి బాలరత్న రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేశారు. కోలాటంలో ప్రతిభ చూపిన ధరణికి శ్రీకాకుళంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పురస్కారం ప్రదానంచేశారు.

చేనేత మగ్గాల పరిశీలన

జి.సిగడాం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరవలసలో మంగళవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారునేస్తున్న మగ్గాలను పరిశీలించారు. ఇటీవల గ్రామానికి చెందిన కె.అశోక్ వత్సవలస జాతరలో సముద్రంలో కొట్టుకుపోతున్న ముగ్గురిని కాపాడే ప్రయత్నంలో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

రేపు రుణాలకు ఎంపికలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అర్హతగల లబ్ధిదారులకు మంజూరుచేస్తాని మునిపిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు.ఈమేరకు దరఖాస్తులు చేసుకున్న వారు ఒరిజనల్ సర్టిఫికెట్లతోగురువారం ఉదయం 10.30 గంటలకు మునిపిపల్ కార్యా లయానికి హాజరుకావాలని కోరారు. ఈ మేరకు దరఖాస్తులు పరిశీలిస్తామని తెలిపారు.

● కవిటి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసిన వారికి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బారువలో ఉత్కళ్ దివస్

సోంపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బారువ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఒడియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉత్కల్ దివస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్‌ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, బి.రాంబాబు, ఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నూర్పిడి యంత్రాల పంపిణీ

బూర్జ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెదపేట గ్రామ సచివాలయంలో ఆహారం, పోషణ పథకంలో నూర్పుడి యంత్రాలను మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ నీలాపురం, పెద్దపేట, లంకాం గ్రామాల రైతులు లుకలాపు పట్టాభినాయుడు, జల్లు కృష్ణ, సూరపు లక్ష్మీనారాయణలకు ఒక్కో యంత్రం రూ. 80వేల రాయితీపై అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రాజగోపాల్, ఓనిగెడ్డ నీటి సంఘం అధ్యక్షుడు కడగల కృష్ణ, మజ్జి అప్పలనాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

రిమ్స్ డిజిటల్ లైబ్రరీలో అగ్నిప్రమాదం

● ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణం



అగ్నిప్రమాదం సంభవించిన డిజిటల్ లైబ్రరీ లోపలి భాగం

అరవసల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని రిమ్స్ డిజిటల్ లైబ్రరీలో మంగళవారం ఓ ఏసీ మెషిన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. లంచ్ సమయం కావడంతో లైబ్రరీలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రిమ్స్ వర్గాల కథనం మేరకు.. లంచ్ సమయం కావడంతో విద్యార్థులంతా భోజనాల కోసం మెస్‌కు వెళ్లారు. లైబ్రేరియన్ దేవానంద్ తన సీటులో కూర్చొని విధులు నిర్వర్తిస్తున్నాడు. అంతలో పక్కనే ఉన్న డిజిటల్ లైబ్రరీ నుంచి వాసన రావడం గమనించి అసిస్టెంట్‌ను అప్రమత్తం చేశాడు. డిజిటల్ లైబ్రరీ లోపల నుంచి దట్టమైన పొగలు రావడం గమనించి, వెంటనే లైబ్రరీకి వెళ్లాడు. లైబ్రరీ లోపల నుంచి పొగతో పాటు ఏసీ పరికరం నుంచి చిన్న మంటలు రావడం గమనించి ఎలక్ట్రీషియన్‌కు ఫోన్ చేసి, మొత్తం భవనానికే విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ప్రిన్సిపాల్‌కు విషయం తెలియజేయడంతో ఆయన వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. అనంతరం ఎలక్ట్రీషియన్ సహాయంతో విద్యుత్ సరఫరాను జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు సమక్షంలో పునరుద్ధరించారు. లైబ్రరీలోని ఓ ఏసీ మెషిన్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు జె.మోహనరావు తెలిపారు. ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరుగలేదని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు డిజిటల్ లైబ్రరీలో లేకపోవడంతో ఎటువంటి ఇబ్బంది కలుగలేదని దేవానంద్ చెప్పారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం



కంబిరిగాం రోడ్డులో పట్టుబడిన టిప్పర్‌తో తహసీల్దార్, ఎస్ఐ

పలాస, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మట్టిని అక్రమంగా తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఎస్ఐ నర్సింహమూర్తి తదితరులు కంబిరి గాం వద్ద అడ్డుకున్నారు. అయితే డ్రైవర్ పరారీ అయ్యాడు. ఈ మేరకు గ్రామం వద్ద టిప్పర్‌ను స్వా ధీనం చేసుకున్నారు. అయితే అధికారులు వస్తున్నారన్న సమాచారంతో మరి కొన్ని టిప్పర్లు, ఎక్స్‌కవేటర్‌ను అక్రమార్కులు అక్కడి నుంచి తరలించారు. ఈ వ్యవహారంపై అధికారులు, పోలీసులు సీరియస్‌గా వ్యవహరించడంతో సదరు వాహన యజమానులు వాహనాలు సరెండర్ చేస్తామని ముందుకు వచ్చారు. ఇంకా దీనిపై కేసు నమోదు చేయలేదని, నిబంధనల మేరకు అపరాధ రుసుం వసూలు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ కేసును రెవెన్యూ శాఖకు అప్పగిస్తామన్నారు.

వ్యాన్ ఢీ కొని ఒకరు మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్)

సంతబొమ్మాళి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర ఇసుకబంద చెరువు వద్ద రొయ్యల వ్యాన్ ఢీ కొని కాపుగోదాయవలసకు చెందిన నందిగాం కాళీ దుర్గాప్రసాద్ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడని సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం తెలిపారు. దుర్గాప్రసాద్ బోరుభద్రలోని పెట్రోల్‌బంక్‌లో సెల్ప్ మన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీ కావడంతో కాలకృత్యాల కోసం రోడ్డుపైకి రాగానే అటు నుంచి వస్తున్న రొయ్యల వ్యాన్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులోపడి వ్యక్తి..

సోంపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లాం తారకేశ్వరాలయం వద్ద ఉన్న చెరువులో పడి మందస మండలంలోని బాలిగాం గ్రామానికి చెందిన గున్న గున్నయ మృతి చెందినట్లు బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కొండముచ్చు దాడిలో బాలికకు గాయాలు

కంచిలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలగోవిందపురం గ్రామానికి చెందిన బాలిక మూలి సింధుపై మంగళవారం ఉదయం కొండముచ్చు దాడి చేసిన ఘటనలో గాయాలయ్యాయి. ఇంటి నుంచి గ్రామంలోని ఆలయానికి తల్లి ఢిల్లీశ్వరితో కలిసి వెళ్తుండగా కొండముచ్చు దాడిచేసింది. భయంతో బాలిక పక్కకు తప్పుకునే క్రమంలో కిందపడిపోవడంతో తలకు గాయమైంది.ఎంఎస్‌పల్లి పీహెచ్‌సీకి తరలించి, వైద్యం చేసినట్లు తల్లి తెలిపింది. గ్రామంలో కొండముచ్చులు, కోతుల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు తెలిపారు.

మూడు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

రణస్థలం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని సినిమా థియేటర్ సమీపంలోని ఓ ఇంట్లో మూడు రోజులుగా మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. నారాయణరావు (60) కొద్ది రోజులుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫిట్స్ వచ్చింది. కుటుంబసభ్యులు ఇతర ప్రాంతాలకు వెళడంతో మూడు రోజులుగా ఇంట్లో లేరు. నారాయణరావు మృతితో దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులుపడ్డారు. ఇంట్లో ఉబ్బిపోయి ఉన్న నారాయణరావు మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

సారా తరలిస్తున్న ఆరుగురి బైండోవర్

పాతపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఆరుగురిని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా ఇప్పటివరకు 43 మంది సారా తరలింపులకు పాల్పడగా వారిని బైండోవర్ చేశామన్నారు.

మునిసిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

కాశీబుగ్గ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు వెంకట్, కూర్మారావు, మురుగన్ డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికులను ఆప్కాస్ నుంచి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొంటూ దీనికి వ్యతిరేకగా మంగళవారం ర్యాలీ నిర్వహించి, గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు రమేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ సంబరం

టెక్కలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):అంజనాపురంలో దుర్గమ్మతల్లి సంబరాలు మంగళవారం ఆనందోత్సాహాలనడుమ నిర్వహించారు. దాసుడు దుర్గారావు నేతృత్వంలో మహిళలు ఆలయానికి వెళ్లి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కళాకారుల ఆట, పాటలతో సందడిచేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పండుగ

గ్రామాల్లో పింఛన్ల పంపిణీని మంగళవారం చేపట్టారు. ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు: ఎంజీఆర్



మెళియాపుట్టి: చీపురుపల్లిలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం/మెళియాపుట్టి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. అంతరాబ, చీపురుపల్లి గ్రామాల్లో పింఛన్లను మంగళవారం అందజేశారు. బూరగాం, పెద్దమడి గ్రామాల్లో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మెళియాపుట్టి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సలాన మోహనరావు, బైరిశింగి లక్ష్మీనారాయణ, నాయకులు పైల బాబ్జీ, శివాల చిన్నయ్య, మడ్డు రామారావు, బాస్కర్ గౌడ్, తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదల కళ్లలో ఆనందం: అశోక్



కవిటి: రామయ్యపుట్టుగలో పింఛన్ పంపిణీ చేస్తున్న విప్ అశోక్

కవిటి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పేదల కళ్లల్లో ఆనందం రావాలంటే చంద్రబాబు పాలనలోనే సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ తెలిపారు. రామయ్యపుట్టుగలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన 240 పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సీఎం మాట ఇస్తే నిలబెట్టుకుంటారు: శిరీష



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట ఇస్తే నిలబెట్టుకుంటారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం జయ రామచంద్రపురంలో కిడ్నీ బాధితురాలు దట్టి వర లక్ష్మికి పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నేతలు లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, నవీన్ పాల్గొన్నారు. ● 4వ వార్డు శాంతినగర్‌లో సుమారు 40 ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్ లేక నీటి పైపులు మంజూరు కాలేదని ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకు వచ్చిన నెలరోజుల్లో పరిష్కరించినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శాంతినగర్‌లో వార్డు ఇన్‌చార్జి రామకృష్ణ ఆధ్వర్యంలో 40 మందికి పొజిషన్ సర్టిఫికేట్‌లను అందించారు. కార్యక్రమంలో బడ్డ నాగరాజు, విఠల్, డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా: శంకర్



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదల కళ్లల్లో ఎంతో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటలో పింఛన్లను మంగళవారం పంపిణీచేశారు. ప్రతీ నెల 1వ తేదీన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంధవరపు సంతోష్, అంధవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యం: ఎన్ఈఆర్



రణస్థలం: కోష్ఠలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

● జి.సిగడాం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) తెలిపారు. మంగళవారం మండలంలోని దేవరవలసలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కంపూడి దాసు, వెంకటరావు, కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, బూరాడ వెంకటరమణ, వజ్జపర్తి రఘురాం పాల్గొన్నారు.

● ఎచ్చెర్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అల్లినగరానికి చెందిన గొర్లె గణేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో మంజూరైన పింఛన్‌ను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ సంపతి రావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అర్హులందరికీ కొత్త పింఛన్లు: బగ్గు

పోలాకి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో కొత్తపింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించి అర్హులందరికీ అందిస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం మబగాంలో పింఛన్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతోందని, అలాగే ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త రేషన్‌కార్డులతో పాటు పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ బగ్గు అర్చన, గ్రామ పెద్దలు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రెల్లి ఉప కులాలకు తీవ్ర అన్యాయం



హిరమండలంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కులస్థులు

హిరమండలం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో రెల్లి, ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రవికుమార్ అన్నారు. హిరమండలంలో జైభీమ్ యువజన సంఘ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయం పోరాటం కోసం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించడం దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు ఒక శాతం రిజర్వేషన్ వర్తించడం అన్యాయ మన్నారు. 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం తీవ్ర తరం చేస్తామన్నారు. కార్యక్రమంలో బత్తిలి, కొత్తూరు, కొరసవాడ, ఎల్.ఎన్‌పేటలకు చెందిన పలువురు రెల్లి కుల సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఈవోని విధుల నుంచి తొలగించాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

టెక్కలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): డీఈవో తిరుమల చైతన్యను విధుల నుంచి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేసి అక్రమ కేసులు పెట్టారన్నారు. వారిపై చేసిన సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డీఈవో చేసిన అక్రమాలపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.దాలయ్య, అప్పారావు, బాబూరావు, శ్రీనివాసరావు, ఆదినారాయణ, నారాయణ రావు, బాబూరావు, సన్యాసిరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'గున్నమ్మ' ఆశయ సాధనకు కృషి చేయాలి



వీరనారి సాసుమాను గున్నమ్మ స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

హరిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సాయుధ రైతాంగ పోరాటంలో పేద ప్రజల తరఫున పోరాటం చేసిన వీరనారి శాసుమాను గున్నమ్మ అని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అన్నారు. వీజీపురంలోని సాసుమాను గున్నమ్మ స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మందసలో కొర్ల హేమారావు చౌదరి అధ్యక్షతన అమరవీరుల స్మారక సభ, సాసుమాను గున్నమ్మ 85వ వర్ధంతి ని నిర్వహించారు. నాటి పోరాటాల ఫలితం గానే మందస ప్రాంతంలో రిజర్వాయర్లు, ఆన కట్టలు వెలిశాయన్నారు. వీజీపురం సర్పంచ్ కర్రి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వీరనారి గున్న మ్మ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఎం.రామకృష్ణ, ఎంపీపీ దానయ్య పాల్గొన్నారు.

జగన్నాథ సంస్కృతిని విస్తరించాలి

పలాసరూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): జగన్నాథ సంస్కృతిని విస్తరించి ఒడిశా సంస్కృతి సంప్రదాయాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. మరదరాజపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పూజారి వీధి ఒడియా బ్రాహ్మణ సంఘం భవనంలో ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మంగళ వారం నిర్వహించారు. పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

● పాతపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్ర అవతరణ సందర్భంగా ఉత్కళ్ దివస్‌ను మంగళవారం నిర్వహించారు. స్థానిక ఒడియా ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం భీంసేన్ పండా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

పలాస, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎమ్మెల్యే గౌతు శిరీష మూడు కొత్త ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పలాస డిపోలో పాత బస్సులు కారణంగా అదనంగా సర్వీసులు వేయలేకపోతు న్నారని, దీన్ని గుర్తించి ప్రభుత్వంతో మాట్లాడిన వెంటనే కొత్తగా బస్సులు మంజూరు చేశారన్నారు. ● స్థానిక 27వ వార్డులో ట్రాలీ రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సీతమ్మతల్లి అమ్మవారి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, నేతలు గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్‌గుప్తా, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, డిపో మేనేజర్ సీతారామ్ నాయుడు, ఏడీఎం సంతోష్‌కుమార్, ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సారా తాగితే అనారోగ్యం

నరసన్నపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సారా తాగడం వల్ల అనారోగ్యం బారిన పడతారని నరసన్నపేట ఎక్సైజ్ సీఐ రమణమూర్తి అన్నారు. మంగళవారం పోలాకి మండలం మబుగాం, వనిత మండలం, జొన్నాం గ్రామాల్లో నవోదయం2.0లో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. సారా తయారు చేయడం చట్టరీత్యా నేరమని, అలాగే తాగడం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనదారులకు రూ.29 కోట్లు చెల్లింపు

జలుమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనులకు రూ.29 కోట్లు వేతనదారులకు చెల్లించినట్లు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. వేతనదారులకు రూ.22 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ పనులకు రూ.7 కోట్లు చెల్లించామన్నారు. 12, 727 కుటుంబాలకు 9,21,691 పని దినాలు కల్పించినట్లు వెల్లడించారు. కాలువలు, చెరువుల్లో పూడిక తీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చేపల చెరువులు తవ్వకం, ఇంకుడు గుంతలు తీయడం వంటి పనులు కూడా ఉపాధిహామీ నిధులతో చేపడుతున్నామని, రైతులు వీటిని వినియోగించుకోవాలని కోరారు.

జీడి బోర్డు ఏర్పాటుకు స్థల పరిశీలన

హరిపురం ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణపురం సమీపంలో పట్టు పరిశ్రమకు చెందిన భూముల్లో జీడి బోర్డు ఏర్పాటుకు గాను మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీష స్థలాన్ని పరిశీలించారు. జీడితోపాటు కొబ్బరి బోర్డు ఏర్పాటుకు ఇక్కడే చర్యలు తీసుకోవాలని స్థానిక నేతలు కోరుతున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హైమావతి, సర్వేయర్ బాబూరావు, డీటీ రామకృష్ణ, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తహసీ ల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. బొడ్డవలసలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. రీ సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, పట్టాదార్లు పేర్లు, భూ విస్తీర్ణంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ఎస్.గవరయ్య, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఆంజనేయస్వామి మందిర వార్షికోత్సవం

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తురకపేట గ్రామంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు అభయాంజనేయస్వామి మందిర వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు పురోహితుడు వేమకోటి శ్రీనివాసశర్మ తెలిపారు. మూడు రోజుల పాటు విశేష పూజలతో పాటు శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నామన్నారు.

నాసో పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

పాతపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన నేషనల్ ఆస్ట్రానిమికల్ సైన్స్ ఒలింపియాడ్ (నాసో) జాతీయస్థాయి పరీక్షల్లో స్థానిక అమరజ్యోతి స్కూల్‌కు చెందిన 17 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. లెవెల్-1లో వివిధ పత కాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్‌తో పాటు ఎంఈవో సీహెచ్ తిరుమలరావు, వైస్ ప్రిన్సిపాల్ ఇప్పిలి మురళీకృష్ణ అభినందించారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్షుడిగా 'పినకాన'



టెక్కలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పినకాన అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సంపతిరావు సూర్యరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ పట్నాయక్, సహాయ కార్యదర్శిగా దాడి ధర్మారావులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, బెండి గౌరీపతి, వైకుంఠరావు, బాబూరావు, రమణరావు, దివాకర్ అభినందించారు.

న్యూస్ బాక్స్

డివిజన్‌లో 72 నీటి తొట్టెలు

టెక్కలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువులకు దాహార్తిని తీర్చేందుకు డివిజన్‌లో 72 నీటి తొట్టెలు ఏర్పాటు చేయనున్నామని పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జయరాజ్ తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ నీటితొట్టెలను ఏర్పాటు చేస్తామన్నారు. మంగళవారం నర్సింగపల్లి, తిర్లంగి గ్రామాల్లో నీటితొట్టెల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీ భాయి, పశువైద్యుడు పూర్ణచంద్రరావు, టీడీపీ నేతలు బగాది శేషగిరిరావు, పోలాకి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన

పలాసరూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పెదంచల గ్రామంలో పశువుల కోసం మంగళవారం నీటి తొట్టెల నిర్మాణానికి ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్ కుమార్, పశు సంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ ఎం.వైకుంఠరావు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, పి.పోలారావు, చిన్ని పాల్గొన్నారు.

రూ.5.46 కోట్ల ఆస్తిపన్ను వసూలు

పలాస, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిపాలిటీ ఆస్తి పన్ను రికార్డు స్థాయిలో వసూలైందని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మార్చి 31వ తేదీ తుది గడువు కాగా సోమవారం రాత్రి వరకు ప్రత్యేక కౌంటర్ తెరిచి పన్ను వసూలు చేశామన్నారు. 80.15 శాతం పన్ను వసూలైందని తెలిపారు. రూ.5.48 కోట్లు వసూ లు కాగా గత ఏడాదితో పోలిస్తే రూ2 కోట్లు ఎక్కువన్నారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్, కేటీ రోడ్డు విస్తరణ పనుల కారణంగా 280 ఆస్తులు నష్టపోవడం వల్ల వారంతా పన్ను చెల్లించలేకపోయారు.

రూ.1.38 లక్షల సెస్ చెల్లింపు

పోలాకి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 31 పంచాయతీల నుంచి 8 శాతం గ్రంథాలయ సెస్‌ను చెల్లించినట్లు మండల పంచాయతీ అధికారి బి.పద్మావతి తెలిపారు. రూ.1.38 లక్షల మొత్తం చెక్కు ద్వారా చెల్లిస్తూ శాఖా గ్రంథాలయాధికారి కింజరాపు మానసకు ఆ జాబితాను అందించామన్నారు. చెల్లాయివలస, దీర్ఘాశి, బొద్దాం గ్రామాల్లో ఇంటిపన్ను వసూలు వేగవంతం చేస్తు న్నామన్నారు.

మొక్కలను నాటాలి

పలాసరూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతకు మొక్కలు దోహదపడతాయని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. కాంట్రగడ ఎంపీపీ పాఠశాల ఆవరణలో కదంబ, చెర్రీ, ఇతర పండ్ల మొక్కలను మంగళవారం నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.గురునాథరావు, వైద్య సిబ్బంది కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

పలాసరూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు గురువారం ఉదయం 10.30గంటల నుంచి ఇంటర్వ్యూ లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వసంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని కోరారు.